
ప్రజాశక్తి

బుధవారం 12 జూన్ 2024

1





అనంతపురం   శ్రీ సత్యసాయి



సీజన్ ముగిశాక పరిశీలన..!

- కరువు పరిశీలనకు కేంద్ర బృందం రాక
- వర్షాలు పడి పచ్చదనం ఉన్న సమయంలో పర్యటన



వార్త 3లో



కదిరిలో కదులుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కుర్చీ..!

- కౌన్సిలర్ల క్యాంపు రాజకీయాలు
- విందుకోసమే అంటున్న వైసిపి నేతలు

వార్త 3లో





ఎంసిఎ ఫలితాలను విడుదల చేస్తున్న జెఎన్‌టియు సిబ్బంది

ఎంసిఎ 4వ సెమిస్టర్ ఫలితాలు విడుదల

అనంతపురం : జెఎన్‌టియు పరిధిలో నిర్వహించిన ఎంసిఎ 4వ సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ తెలిపారు. పరీక్ష ఫలితాల్లో 98శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులు పరీక్ష ఫలితాల కోసం కళాశాల అకాడిమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, డిప్యూటీ కంట్రోలర్ అఫ్ ఎగ్జామినేషన్స్ డి.విష్ణువర్ధన్, వివిధ విభాగాల అధిపతులు కె.ఎఫ్.భారతి, ఎం.రామశేఖర్‌రెడ్డి, కళ్యాణి రాధ, అజిత, తదితరులు పాల్గొన్నారు.

14న వేలంపాట

నార్పల : నార్పల గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆదాయ ప్రతిఫలమిచ్చు వ్యాపారాలకు ఈనెల 14న వేలంపాటలు నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండు, వారపు సంత, మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణకు బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనాలనుకునే వారు వారపు సంతకు రూ.లక్ష, బస్టాండ్‌కు రూ.లక్ష, మూత్రశాల, మరుగుదొడ్లుకు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి పాల్గొనవచ్చన్నారు.

ప్రత్యేక హోదా తీసుకురావాలి

రాయదుర్గం : నూతనంగా ఎన్‌డిఎ కూటిమి అధికారంలోకి వస్తుండటంతో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు కృషి చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందనూరు నాగరాజు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో టిడిపి కీలకపాత్ర పోషించినందున రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన కోసం కూటమి ప్రతినిధులు చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో బిజెపికి కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో పూర్తి మెజారిటీ ఉన్నందున రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనకు వీలుపడలేదన్నారు. అయితే ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం రూపకల్పనలో టిడిపి కూటమికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. కావున ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన సులభంగా సాధ్యమవుతుందన్నారు. ఇప్పటికైనా కూటమి నేలతు రాష్ట్రానికి ప్రత్యేక హోదా తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రూ.2.80 లక్షల అమ్మకాలు నిలుపుదల

అనంతపురం : నగరంలోని పలు ఎరువుల దుకాణాలు వ్యవసాయ శాఖ అనంతపురం డివిజన్ ఎడిఎ ఎం.రవి మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆదేశాల మేరకు నగరంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా పాతూరులోని పుడమి అగ్రిమార్ట్ దుకాణంలో కాలపరిమితి ముగిసిన ఓ ఫార్మ్‌తో రైతులకు ఉత్పత్తులు అమ్ముతుండటాన్ని గమనించి రూ.2.80 లక్షల విలువైన ఉత్పత్తులను నిలిపివేయాలని ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అనంతపురం రూరల్ మండలం వ్యవసాయ అధికారిణి జె.శశికళ, వ్యవసాయ విస్తరణ అధికారి మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఎరువులను పరిశీలిస్తున్న ఎడిఎ ఎం.రవి

గ్రామాల్లో 'ఉపాధి' పనులు కల్పించాలి

వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి



కూలీల సమస్యలు తెలుసుకుంటున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి-శింగనమల

గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని రాచేపల్లి, సలకంచెరువు గ్రామాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులను వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కూలీలతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ కూలీలు రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈనేపథ్యంలో ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఇప్పటి వరకూ చేసిన పనులకు వెంటనే బిల్లులను కూలీల ఖాతాలో జమ చేయాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, కూలీలకు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సుంకన్న, ఎర్రిస్వామి, రామాంజనేయులు, ఆంజనేయులు, కుళ్లాయప్ప, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌ను భ్రమలో పెట్టిన భజన ఉద్యోగ సంఘాలు

ఎపి ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

రాష్ట్రంలోని ఉద్యోగులంతా తమవైపే ఉన్నారని మాజీ సిఎం జగన్‌ను కొన్ని భజన ఉద్యోగ సంఘాలు భ్రమలో పెట్టాయని ఎపి రాష్ట్ర ఎంపాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లపల్లి విజయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తుంటే కొన్ని భజన ఉద్యోగ సంఘాలు ఈ పోరాటాన్ని అవకాశవాద ఉద్యమాలుగా వక్రీకరించాయని ఆరోపించారు. అంతేగాకుండా సామాన్య ఉద్యోగి ప్రభుత్వ పాలసీల పట్ల సంతృప్తిగా ఉన్నారని, ఉద్యోగులంతా తమవైపే ఉంటారని ప్రభుత్వ భజన ఉద్యోగ సంఘాలు తప్పుదారి పట్టించాయన్నారు. వారి మాటలను విన్న జగన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించారన్నారు. అదేవిధంగా ఉద్యోగుల సమస్యలపై చర్చించడానికి నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఏనాడూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే దిశగా పని చేయలేదన్నారు. కేవలం 'ఛాయ్.. బిస్కెట్ సమావేశాలు'గా ఉద్యోగ సంఘాలతో సమావేశాలు జరిగేవని ఎద్దేవా చేశారు. మంత్రివర్గ ఉపసంఘంలోని మంత్రులు ఉద్యోగులను కనీసం ఓటర్లుగా కూడా చూడలేదన్నారు. ప్రభుత్వ భజన సంఘాలు, మంత్రి వర్గ ఉపసంఘంపై వ్యతిరేకతతోనే ఉద్యోగులు, ఉపాధ్యాయులు జగన్‌కు దూరయ్యారన్నారు.

టిడిపి దాడులు అప్రజాస్వామికం : వైసిపి



విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-ఉరవకొండ

రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చిన మరుక్షణం నుంచే ఉరవకొండలో ఆ పార్టీ శ్రేణులు వైసిపి కార్యకర్తలపై దాడులకు తెగబడటం బాధాకమరని వైసిపి బిసి విభాగం జిల్లా అధికార ప్రతినిధి సిపి.వీరన్న, ఎంపిపి నరసింహులు, మాజీ ఎంపిపి ఎసి ఎర్రిస్వామి, రాష్ట్ర నాయకులు బసవరాజు వాపోయారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలలో గెలుపోటములు సహజమన్నారు. గతంలో ఉరవకొండ నియోజకవర్గంలో అనేక పార్టీలు ఓడటం, గెలవడం చూశామన్నారు. అయితే ఎన్నికల అనంతరం ఏ పార్టీ వారు కూడా దాడులకు దిగలేదన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఉరవకొండలో కొంతమంది టిడిపి శ్రేణులు విచక్షణ మరిచి దాడులకు తెగబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారం శాశ్వతం కాదని, ఇలాంటి సంఘటనలు వల్ల టిడిపినే తీవ్రంగా నష్టపోతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది టిడిపి శ్రేణులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలను ధ్వంసం చేయడం, శిలాఫలకాలను పగలగొట్టడం, ప్రభుత్వ కార్యాలయాలను సైతం ధ్వంసం చేస్తున్నారన్నారు. దాడులను తక్షణమే ఆపి అభివృద్ధి, ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలని సూచించారు. ఇలాగే దాడులు కొనసాగిస్తే ప్రతీకార దాడులకు సైతం వెనకాడేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సోంపల్లి ఈశ్వర్, నాయకులు ఓబన్న, గోవిందు, జెట్టి.రమేష్, ఓబయ్య, ఉలిగప్ప, తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు కూలిన చెట్టు

పామిడి : ఈదురు గాలులతో కూడిన వర్షానికి మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న పెద్ద వేపచెట్టు నేలకూలింది. కార్యాలయానికి వచ్చేవారు సేద తీరేందుకు వీలుగా ఉన్న చెట్టు ఒక్కసారిగా నేలకూలింది. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, కార్యాలయ సిబ్బంది చెట్టు వద్దకు చేరుకుని పరిశీలించారు.



కూలిన చెట్టును పరిశీలిస్తున్న అధికారులు

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తి అనంతపురం సమీపంలో ఉన్న మాసినేని ప్రయివేటు పాఠశాల వెనుక భాగంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనుగొన్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతిచెందిన వ్యక్తికి సుమారు 40 ఏళ్లు ఉండి, ఎరుపు, నలుపు రంగులు కలిగిన దుస్తులను దరించి ఉన్నాడన్నారు. ఎవరైనా చంపి ఇక్కడ పడవేశారా? లేక ఇతనే ఆత్మహత్య చేసుకున్నాడా.. అనే అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి గుర్తు తెలియని వ్యక్తిగా కేసునమోదు చేసినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..



మృతిచెందిన ఎర్రిస్వామి

పెద్దవడుగూరు : మండలంలోని ముప్పాలగుత్తికి చెందిన ఎర్రిస్వామి(45) మంగళవారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడు తన ఇంటి వద్ద కొళాయి నీటిని మోటారు ద్వారా సరఫరా చేస్తున్న తరుణంలో ఇంటి బయట ఉన్న గేట్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ కొట్టింది. దీంతో వెంటనే బంధువులు చికిత్స కోసం పెద్దవడుగూరులోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు వైద్యుడు అమర్నాథ్ ధ్రువీకరించారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇప్పటికే ఏడాది క్రితం భార్య కేన్సర్ వ్యాధితో మృత్యువాతపడగా ఎర్రిస్వామి కూడా మృతిచెందడంతో పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం మృతుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

తేనెటీగల దాడి..

ఎంపిహెచ్‌ఒ, ఆశా కార్యకర్తకు గాయాలు

పెద్దవడుగూరు : మండలంలోని కిష్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఎంపిహెచ్‌ఒ కంబగిరి రాముడు, ఆశా కార్యకర్త సావిత్రిపై మంగళవారం తేనెటీగలు దాడి చేశాయి. ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వంట తయారు చేస్తున్న తరుణంలో ఒక్కసారిగా తేనేటీగలు ఎక్కడి నుంచో వచ్చి దాడి చేశాయి. ఈదాడిలో ఎంపిహెచ్‌ఒతోపాటు ఆశాకార్యకర్తకు గాయాలయ్యాయి. వీరిలో సావిత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణ పొలిమేరలో పైతోట దగ్గర జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆవు అక్కడికక్కడే మృతిచెందింది. ఇద్దరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే... మొలకల్మూరు నుంచి రాయదుర్గం వైపు అతివేగంతో వెళ్తున్న మోటార్ సైకిల్ అవును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆవు మృతిచెందింది. తమ్మేపల్లి-వీరాపురం గ్రామానికి చెందిన ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై రాయదుర్గం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన యువకులు, మృతిచెందిన ఆవు

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పామిడి : స్థానిక ఆదర్శ పాఠశాలలో మిగిలిపోయిన సీట్ల ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు ఈనెల 17వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అరుణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 తరగతి జనరల్ 1, 8వ తరగతి జనరల్ 4, 9వ తరగతి జనరల్ 1 సీటు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆయా సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 19న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీజన్ ముగిశాక పరిశీలన..!

కరువు పరిశీలనకు కేంద్ర బృందం రాక - వర్షాలు పడి పచ్చదనం ఉన్న సమయంలో పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'దొంగలు పడ్డ ఆరు మాసాలకు కుక్కలు మొరిగాయి' అన్న చందంగా ఉంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయ్యాక రబీ కరువుపై కరువు బృందం వచ్చేందుకు సిద్ధమైంది. గతేడాది ఖరీఫ్‌లో తీవ్ర వర్షాభావంతో కరువు ఏర్పడింది. అదే కరువు రబీలోనూ కొనసాగింది. తీవ్ర వర్షాభావంతో పంటలు ఏ మాత్రం రైతుల చేతికందలేదు. ఇప్పటికే ప్రభుత్వం కరువు మండలాలు ప్రకటించింది. అనంతపురం జిల్లా వరకు 14 మండలాను కరువు మండలాలుగా ప్రకటించారు. అదే విధంగా సత్యసాయి జిల్లాలో రొద్దం మండలం ఒక్కటే కరువు మండలంగా ప్రకటించారు. రబీ సీజన్ పంట సమయంలో కరువు బృందం పర్యటించలేదు. ఇప్పుడు వర్షాలు పడుతున్న సమయంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యాక బృందం పర్యటించనున్నట్టు ప్రకటన వెలువడింది.



రూ.36.86 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు

అనంతపురం జిల్లాలో రబీలో ఏర్పడిన కరువుకు సంబంధించి పంటనష్టం అంచనాలను అధికారులు రూపొందించారు. దీని ప్రకారం మొత్తం 37,195 హెక్టార్లు పంటనష్టం జరిగినట్టు అంచనా వేశారు. ఇందులో పప్పుశనగ 34,303 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. దీనికి రూ34.30 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదనలు పంపించారు. మినుములు 274 హెక్టార్లకు రూ.27.43 లక్షలు, అలసందలు 3.21 హెక్టార్లకు రూ.32 లక్షలు నష్టం జరిగింది. పెసలు 55.84 హెక్టార్లలో పంటనష్టం జరిగింది. రూ.5.58 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదించారు. ఉలవలు 64.17 హెక్టార్లు పంటనష్టం జరిగింది. రూ.6.42 లక్షలు, జొన్న 2101.04 హెక్టార్లు రూ.1.78 కోట్లు, కొర్ర 0.47 ఎకరాలు, నాలుగువేలు, నువ్వులు 46.38 హెక్టార్లు, రూ.3.94 లక్షలు, తెల్లకుసుమ 49.39 హెక్టార్లు రూ.4.20 లక్షలు, పొద్దుతిరుగుడు 296.94 హెక్టార్లు, రూ.29.69 లక్షలు ఇన్‌పుట్ సబ్సిడీకి ప్రతిపాదించారు.

సీజన్ మారాక పంటనష్టం పరిశీలన ఎలా..?

ప్రస్తుతం రబీ సీజన్ మారింది. మే ఆఖరు వారం నుంచి వర్షాలు పడుతున్నాయి. ఈ వారం రోజులుగా పడుతున్న వర్షాలు అంతటా పచ్చదనం కనిపిస్తోంది. ఇటువంటి సమయంలో రబీ కరువు పంటనష్టం పరిశీలన ఎలా సాధ్యమవుతుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వచ్చినా చూసేది ఏముంటుంది. అందే సాయం ఏ మేరకు అన్నది చూడాల్సి ఉంది. మొత్తానికి కేంద్ర కరువు బృందం పరిశీలన ఉంటుందని చెప్పడంతో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కరువు మొత్తం పూర్తయ్యి సీజన్ మారిన తరువాత పరిశీలన జరిపి ఆదుకునేది ఏమింటుంది. ఇది రైతులకు ఎలాంటి ఉపయోగం లేదు. నష్టం జరిగినే సమయంలోనే పరిశీలన చేస్తే రైతుల కష్టాలు తెలుస్తాయి. ప్రభుత్వం ఇప్పటికైనా రబీ నష్టాన్ని పూర్తిగా అంచనా వేసి రైతులకు పరిహారం అందించే చర్యలు తీసుకోవాలి.

చంద్రశేఖర్,
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి.

డెంగీ మరణాలు లేకుండా చర్యలు

పక్కాగా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలి

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



జిల్లాలో డెంగీ వ్యాధితో ఏ ఒక్క చిన్నారీ మరణించకుండా అన్ని చర్యలూ తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మలేరియ కార్యాచరణ ప్రణాళిక, డెంగ్యూ జ్వరంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ నెల ప్రపంచ మలేరియా నెల అన్నారు. ఇందుకు సంబంధించి రోజువారీగా క్యాలెండర్ సిద్ధం చేసి వివరాలు అందించాలన్నారు. క్యాలెండర్ ప్రకారం అన్ని పనులు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈ సీజన్‌లో చిన్నారులు ఎవరూ డెంగ్యూతో చనిపోరాదన్నారు. డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్, జిల్లా మలేరియా అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ అందరూ కలిసికట్టుగా పనిచేసి మలేరియ, డెంగ్యూ వ్యాధులను అరికట్టాలన్నారు. ఎవరికైనా డెంగ్యూ వ్యాధి సోకినా తక్షణమే చికిత్స అందించాలని తెలియజేశారు. ప్రయివేటు హాస్పిటల్స్‌తో కూడా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకుని ఎక్కడైనా వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. విస్తతస్థాయిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. దోమల నివారణకు అన్ని చర్యలూ తీసుకోవాలన్నారు. ఫాగింగ్, ఫ్రైడే డ్రైడే యాక్టివిటీలు, ఆయిల్ బాల్స్ వేయడం, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, తదితర అంశాలపై వివరణాత్మకంగా కార్యచరణ ప్రణాళిక తయారు చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఎఫ్ఒ వినీత్ కుమార్, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, డిసిహెచ్ఎస్ పాల్ డా॥రవికుమార్, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా॥కిరణ్ కుమార్ రెడ్డి, జిల్లా మలేరియా అధికారి ఓబులు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఆర్డీ పివివిఎస్.మూర్తి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

స్థలం వివాదంతోనే ఎన్ఎస్‌యుఐ నేత హత్య

రూ.55 లక్షలకు సుఫారీ - ఐదుగురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

జిల్లాలో తీవ్ర కలకలం రేపిన ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్‌కుమార్ హత్య కేసును ధర్మవరం పోలీసులు చేధించారు. ఇందుకు సంబంధించి ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. స్థలం వివాదంలో నెలకొన్న ఘర్షణే హత్యకు కారణం అని పోలీసులు నిర్ధారించారు. హత్య, నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాలను మంగళవారం ధర్మవరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ శ్రీనివాసులు సిఐ సుబ్రమణ్యంతో కలిసి విలేకరులకు వెల్లడించారు. ఎన్ఎస్‌యుఐ జాతీయ కార్యదర్శి, యువ న్యాయవాది సంపత్ కుమార్ గత నెల 29వ తేదీన దారుణహత్యకు గురైయ్యాడు. ధర్మవరం చెరువు కట్ట కింద ఈయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. దీనిపై ప్రత్యేక బృందాలతో పోలీసులు దర్యాప్తు చేపట్టి, ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు.

హిందూపురానికి చెందిన సంపత్‌కుమార్ ఎన్ఎస్ఎయుఐ జాతీయ నాయకునిగా, యువ న్యాయవాదిగా ఉన్నాడు. సంపత్ కుమార్ స్నేహితుడు శ్రీకాత్‌రెడ్డికి హిందూపురం పట్టణానికి చెందిన న్యాయవాది కృష్ణారెడ్డికి మధ్య ఓ స్థలం వివాదం నడుస్తోంది. ఇందులో స్నేహితునికి మద్దతుగా సంపత్‌కుమార్ నిలిచాడు. తన స్నేహితునికి స్థలం దక్కేలా పలు విధాలుగా పోరాటం చేశాడు. ఇందులో భాగంగా కృష్ణారెడ్డిపై పోలీసు స్టేషన్‌లో కేసు కూడా పెట్టాడు. ఈ సమస్య పెద్దది కావడంతో కృష్ణారెడ్డి సంపత్‌కుమార్‌ను అడ్డుతొలగించాలని భావించాడు. అందులో భాగంగా ఆయన్ను హత్య చేసేందుకు సుఫారీ గ్యాంగ్‌తో ఒప్పందం చేసుకున్నాడు. గత నెల 26వ తేదీన హిందూపురం పట్టణం ముద్దిరెడ్డిపల్లికి చెందిన సెటిలెమెంట్ రామంజితోపాటు అతని అనుచరులు ధర్మవరం పట్టణం సిద్ధయ్యగుట్టకు చెందిన రంగం రవీంద్ర (ప్రస్తుతం హిందూపురంలో నివసిస్తున్నాడు), హిందూపురానికి చెందిన భుమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసులు నాయుడుతో సంపత్‌కుమార్‌ను హత్య చేసేందుకు న్యాయవాది కష్ణారెడ్డి, అతని కుమారుడు నాగార్జునరెడ్డిలు రూ.55 లక్షలకు సుఫారీ ఒప్పందం కుదుర్చుకున్నారు. అడ్వాన్స్‌గా రూ.5 లక్షలను న్యాయవాది కష్ణారెడ్డి సెటిల్‌మెంట్ రామంజికి ఇచ్చాడు. ఈ క్రమంలో మే 29వ తేదీన రామంజి తన స్నేహితుడితో కదిరి వెళ్లేందుకు కారు కావాలని తీసుకున్నాడు. ఆ కారులో హిందూపురానికి వచ్చి సంపత్‌కుమార్ కలిశారు. రామాంజి అతని అనుచరులు శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లు 29వ తేదీ రాత్రి కారులో సంపత్‌కుమార్‌ను ఎక్కించుకుని మద్యం తాగుదామంటూ కర్నాటక రాష్ట్రం చింతలపల్లికి వెళ్లే రోడ్డు వైపు తీసుకెళ్లారు. అక్కడే తారురోడ్డు పక్కన ఉన్న కాలువ దగ్గరకు తీసుకెళ్లి ముందస్తు పథకం ప్రకారం బీరు తాగించి ఆ బీరు సీసాలతో సంపత్‌కుమార్‌ను పొడిచారు. అనంతరం వారి వెంట తెచ్చుకున్న బాకులు, కత్తులు, కొడవళ్లతో పొడి హత్య చేశారు. సంపత్‌కుమార్ మరణించాడని తెలుసుకున్న తర్వాత అతని మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకుని ధర్మవరం చెరువు రెండో మరువ వద్దకు తీసుకొచ్చి కంపచెట్లలో పడేసి వెళ్లిపోయారు. మే 30వ తేదీన ఉదయం అనంతపురంలో న్యాయవాది కష్ణారెడ్డి క్లర్క్ నరేంద్ర వద్దకొచ్చి రామంజి రూ.10లక్షలు నగదు తీసుకున్నాడు. అనంతపురంలో కారు వదిలేసి అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లిపోయారు. హతుడు సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు ధర్మవరం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా అనుమానితులైన కృష్ణారెడ్డి వైపు నుంచి దర్యాప్తు చేపట్టగా హత్య విషయం బయట పడింది. ఇందులో భాగంగా హత్య చేసిన రామంజి, అనుచరులు శ్రీనివాసులు, రవీంద్ర, లోకేష్, శ్రీకాంత్‌లను కనగానపల్లి మండలం మామిళ్లపల్లి క్రాస్ వద్ద మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.7లక్షల నగదు, కత్తులు, కొడవళ్లు, కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. హత్యకు సంబంధించి పరారీలో ఉన్న మిగిలిన నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ తెలిపారు. కాగా హత్య కేసును చేధించిన డీఎస్పీ శ్రీనివాసులు, సిఐ సుబ్రమణ్యం, హిందూపురం వన్‌టౌన్ సిఐ శ్రీనివాసులు, సిబ్బందిని ఎస్పీ మాధవరెడ్డి అభినందించారు.



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు



బెంగుళూరులోని ఓ హోటల్‌లో కదిరి కౌన్సిలర్లు

కదిరిలో కదులుతున్న...

మున్సిపల్ ఛైర్‌పర్సన్ కుర్చీ..!

కౌన్సిలర్ల క్యాంపు రాజకీయాలు విందుకోసమే అంటున్న వైసిపి నేతలు

ప్రజాశక్తి-కదిరి అర్బన్

సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ఘన విజయం సాధించింది. ఇదే ఊపులో కదిరి నియోజకవర్గంలో కందికుంట వెంటకప్రసాద్ టిడిపి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో ఆ ప్రభావం పురపాలికలపై పడుతోంది. ఈ క్రమంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కూర్చీ కదులుతోందనే వాదనలు బలంగా విన్పిస్తోంది. ఇటీవల వైసిపి కౌన్సిలర్లు క్యాంపు రాజకీయాలకు వెళ్లడం దీనికి బలాన్ని చేకూరుస్తోంది. వైసిపి కౌన్సిలర్లకు తాజాగా ఆ పార్టీ ముఖ్య నేతలు విందు సమావేశం ఏర్పాటు చేయడంపై పలు గుసగుసలు విన్పిస్తున్నాయి. సోమవారం నాడు కదిరి వైసీపీ నాయకులు కర్నాటకకు క్యాంప్‌కు వెళ్లారు. దీనిపై రకరకాల ఊహాగానాలు తెరపైకి వస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టడంతో వైసిపి కౌన్సిలర్లు టిడిపి తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం నడుస్తోంది. ఇలా జరగకుండా వైసీపీ ముఖ్య నాయకులు క్యాంపు రాజకీయాలకు తెర లేపారనే ప్రచారం ఉంది. వైసిపి నాయకులు మాత్రం ఇది కేవలం విహారయాత్ర మాత్రమేనంటూ కొట్టిపారేస్తున్నారు. కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లిన సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ గదికి తాళాలు వేశారు. వైసీపీ అభ్యర్థి వద్దకు ఆపార్టీ కౌన్సిలర్లను తీసుకెళ్లి తామంతా ఐక్యమత్యంగా ఉండి కదిరిలో వైసిపికి పూర్వ వైభవం తీసుకొస్తామని భరోసా ఇచ్చే ప్రయత్నం కూడా జరిగినట్లు సమాచారం. కాగా ఓటమి తర్వాత వైసిపి అభ్యర్థి కదిరి నుంచి దూరంగా వెళ్లడంపైనా కొందరు కౌన్సిలర్లు, నాయకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఓటమిని సవాల్‌గా తీసుకుని ముందుకుసాగి పార్టీ శ్రేణుల్లో ఆత్మస్థైర్యం నింపాలని చెబుతున్నారు. ఏది ఏమైనా రాష్ట్రంలో ప్రభుత్వం మారిన సమయంలో కదిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మార్పుపై వస్తున్న ఊహాగానాలు రాజకీయాంగా పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజావక్తి-కొత్తచెరువు

మండల పరిధిలోని మైలేపల్లి చెరువు వద్ద మంగళవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి .పోలీసులు తెలిపిన మేరకు... మండలంలో వేములేటి పల్లికి చెందిన రామాంజనేయులు సొంతపని నిమిత్తం కొత్తచెరువుకు మోటార్ బైక్‌లో వస్తున్నాడు, అదే సమయంలో జానకంపల్లికి చెందిన సుధాకర్ మరో ద్విచక్రవాహనంలో మైలేపల్లికి వెళుతూ ఎదురెదురుగా ఢీకొన్నారు ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్ర గాయాలు అయ్యాయి వీరిని 108 లో ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రాజా రమేష్ తెలిపారు.

13న వారపు సంత బహిరంగ వేలం

ప్రజాశక్తి - లేపాక్షి

లేపాక్షి పంచాయతీ పరిధిలోని వారపు సంత, బస్టాండ్ పరిధిలో వాహనాల రుసుము వసూలు కోసం ఈనెల 13న బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ వేలం పాటలో పాల్గొనదలచిన వారు బస్సు స్టాండ్ రుసుము వసూలు దక్కించు కోవడం కోసం రెండు లక్షలు రూపాయలు ధరవాతు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. అలాగే వారపు సంత నిర్వహణకు వేలం పాటలో పాల్గొనే వారు 30 వేల రూపాయలు దరవాతు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్తకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి. సంపత్ కుమార్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఆయన గుంటూరు వ్యవసాయ విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ శారదా జయలక్ష్మి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈయన పరిశోధనాస్థానం అధిపతిగా పనిచేశారు. వేరుశనగ అధిక దిగుబడి కోసం చేసిన పరిశోధనలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. ఇక్కడ రూపొందించినకొత్త రకాలు రైతుల మన్ననలు పొంది వేరుశనగ దిగుబడులు పెరగడానికి దోహదపడ్డాయి. ఈ పరిశోధనా స్థానంలో ఈయన ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అధిక మొత్తంలో నాణ్యమైన విత్తనాన్ని అందించినందుకు గాను జాతీయస్థాయిలో పరిశోధనాస్థానానికి జాతీయ అవార్డు వరించింది. అంతేకాకుండా ఈయన వ్యక్తిగతంగా ఉత్తమ శాస్త్రవేత్తగా రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో అవార్డులు అందుకున్నారు జాతీయ స్థాయిలో వేరుశనగ శాస్త్రవేత్తగా ఫెలోషిప్ కూడా అందుకున్నారు. ఈ నేపథ్యంలో సంపత్‌కుమార్‌కు రాష్ట్రస్థాయి ఉద్యోగోన్నతి లభించినందుకు స్థానిక శాస్త్రవేత్తలు, పరిశోధనాస్థానం సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో తన పరిధిలో కదిరి పరిశోధన స్థానం అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

ఇళ్లలోకి వర్షం నీరు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పుట్టపర్తి పట్టణ కేంద్రంలోని పెద్ద బజారులోని ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. దీంతో ఆ కాలనీవాసులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా కూడా లేకపోవడంతో వారి అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. ఈ సందర్భంగాకాలనీవాసులు మాట్లాడుతూ పట్టణంలోని సత్యం గుడి వెనుక భాగాన ఉన్న పెద్ద బజార్ లో అక్రమ కట్టడాలు కట్టడం వల్ల చిత్రావతి నదిలోకి వెళ్లాల్సిన నీరు ఎటు పోలేక తమ ఇళ్లలోకి చేరుతున్నాయన్నారు. వర్షాకాలం మొదలైతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఎన్నిసార్లు అధికారులు చుట్టూ తిరిగిన సమస్య పరిష్కరించలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

మానవత్వం చాటుకున్న 'కందికుంట' అభిమానులు

ప్రజాశక్తి కదిరి టౌన్

టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వెళుతున్న స్థానిక కందికుంట వెంకటప్రసాద్ అభిమానులు గుండెపోటుతో అస్వస్థతకు గురైన ఆర్టీసీ డ్రైవర్‌కు ఆసుపత్రికి చేర్చి తమ మానవత్వం చాటుకున్నారు. అద్దంకి - పొదిలి మార్గమధ్యంలో అద్దంకి డిపోకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రమణారెడ్డి అలియాస్ డానియల్‌కు గుండెపోటు రావడంతో బస్సు నిలిపివేశారు. అదే సందర్భంలో అటుగా వెళుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అభిమానులు వెంటనే స్పందించి డ్రైవరును తమ కారులో ఎక్కించుకొని ఆసుపత్రిలో చేర్పించారు. ఇంతలో డిపోలో ఉన్న కండక్టర్లు, డ్రైవర్లతో పాటు డిపో మేనేజర్‌మహబూబ్‌బీ ఆసుపత్రికి వచ్చారు. సరైన సమయంలో స్పందించి తమ డ్రైవర్‌కు ఆసుపత్రికి చేర్చిన కందికుంట అభిమానులు రెక్కమాను సుధాకర్,రెక్కమాను రామానుజులు, కాకర్ల రవీంద్రారెడ్డి,పుల్ల మోహన్, పుల్ల గంగాధర్, పాయకట్టు శ్రీనివాసులు, సామచేనుబైలు రామానుజులు తదితరులకు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



ఆసుపత్రిలో ఆర్టీసీ బస్సు డ్రైవర్

దేవరాయ పాఠశాల యాజమాన్యానికి నోటీసులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలకేంద్రంలో నిబంధనలు పాటించని దేవరాయ ఇంగ్లీషు మీడియం స్కూల్ యాజమాన్యానికి విద్యాశాఖ అధికారులు నోటీసులు జారీ చేశారు. 'యథేచ్ఛగా ప్రయివేటు దోపిడీ' అనే శీర్షిక ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథానానికి జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించారు. డివైఇఒ రంగస్వామి, ఎంఇఒ -1 పద్మప్రియ మంగళవారం స్థానిక దేవరాయ ప్రయివేటు పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ దేవరాయ పాఠశాలకు నర్సరీ నుండి 10 వరకు అనుమతులు లేవన్నారు. కేవలం 1 నుండి 7 వ తరగతి వరకు మాత్రమే అనుమతి ఉందని అన్నారు. అలాంటపుడు లేనిది ఉందని చెప్పి బ్యానర్లు పెట్టి విద్యార్థులను వారి తల్లిదండ్రులను మోసం చేయడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా హాస్టల్ నిర్వహణ ఎలా చేస్తారని యజమాన్యాన్ని ప్రశ్నించారు. నవోదయ, ఎపిఆర్ఎస్, కేరళ టీచర్లతో శిక్షణ వంటి ఆకర్షణీయమైన ప్రకటనలు చేయరాదన్నారు. వెంటనే ప్రకటన వేసిన బ్యానర్లు తొలగించాలని ఆదేశించారు. అయితే మంగళవారం సాయంత్రమైనా బ్యానర్లను తొలగించకపోవటంతో పంచాయతీ సిబ్బంది సహకారంతో బ్యానర్లను తొలిగించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఇలాంటి ప్రయివేటు పాఠశాలల మాయలో పడి మోసపోవద్దని సూచించారు. ఆ పాఠశాలలో ప్రీ ప్రైమరి అనగా నర్సరీ, ఎల్ కే జీ,యూకేజీలకు, అలాగే 8-10 వరకు అనుమతి లేదని ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు గమనించాలని అన్నారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు చేసి విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని యాజమాన్యాన్ని హెచ్చరించారు.



బ్యానర్ తొలగిస్తున్న సిబ్బంది

హమాలీలకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కదిరి టౌన్

సివిల్ సప్లై గౌడౌన్‌లో పనిచేస్తున్న హమాలీలకు ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్. వెంకటేష్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని స్టాక్ పాయింట్ వద్ద కదిరి డివిజన్‌లోని ముదిగుబ్బ, కదిరి, గాండ్లపెంట, తనకల్లు, ఓడిసి మండలాల్లోని స్టాక్ పాయింట్ల హమాలీల జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇఎస్. వెంకటేష్ మాట్లాడూతూ సివిల్ సప్లై హమాలీలకు 3 నెలలుగా డీలర్స్ నుంచి వస్తున్న కూలి చెల్లింపులో నిర్లక్ష్య ధోరణీ జరుగుతోందని విమర్శించారు. ఆరు ఏడు సంవత్సరాలుగా పనిచేసిన హమాలీల పేర్లను వెంటనే పిఎఫ్ కు సంబంధించిన లిస్ట్ లోకి ఎక్కించాలని డిమాండ్ చేశారు. శ్రీ సత్య సాయి జిల్లాలోని 12 స్టాక్ పాయింట్లలో 200 మందికి పైగా ఉన్న హమాలీలు అనేక సవత్సరాలగా పనిచేస్తున్నారన్నారు. గతంలో డీలర్స్ ద్వారా కూలి చెల్లించేవారని అన్నారు. ఆరు నెలల క్రితం కాంట్రాక్టర్ ద్వారా కూలి చెల్లించాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. నెల నెలా కూలి చెల్లించకపోవడంతో హమాలీలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేసిన పనికి కూలి అడితే తమకు సంబంధం లేదని అనేక స్టాక్ పాయింట్లలో ఉన్న కాంట్రాక్టర్లు అంటున్నారన్నారు. 12 స్టాక్ పాయింట్లలో దాదాపు 60 మంది హమాలీలకు పిఎఫ్ లో పేర్లు నమోదు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటికే అనేక రూపాల్లో అధికారులను కోరామన్నారు. స్వీపర్, వాచ్‌మెన్‌లకు 7 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోతే వారు ఎలా పనిచేస్తారని అన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా హమాలీల సమస్యల పట్ల దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివిఎల్ నరసింహులు, కదిరి పట్టణ కార్యదర్శి జగన్, సివిల్ సప్లై వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, మేస్త్రీలు ఫక్రుద్దీన్, కొండయ్య, కిష్ట, సూరి, వెంకటరమణ, శివ నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి : డిఎస్‌పి

గాండ్లపెంట :స్థానిక పోలీస్ స్టేషన్‌పరిధిలో ఉన్న పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలని డిఎస్‌పి శ్రీలత ఎస్ఐ కృష్ణవేణిని ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం స్థానిక పోలీసుస్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జమేదారులు పి రామయ్య, తిరుమలరెడ్డి, శ్రీనివాసులు, సిబ్బంది శ్రీనివాసులు, బాషా, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నీట్' ఫలితాలపై సమగ్ర విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

2024 నీట్ పరీక్ష ఫలితాల నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుండి అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని,పరీక్ష నిర్వహణ తీరుపై సమగ్ర విచారణ నిర్వహించి, విద్యార్థులందరికీ న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని బిసి వసతిగృహం వద్ద బాబావలి మాట్లాడుతు 2024 నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై దేశవ్యాప్తంగా అనేక అనుమానాలు, అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలతో సమగ్ర న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష ఫలితాలలో ఒకే పరీక్ష కేంద్రం ఉన్న ఒకే సీరియల్ నెంబర్లతో కూడిన ఉన్న విద్యార్థులకు ర్యాంకులు రావడం ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. లక్షలాదిమంది విద్యార్థులు దీనిపై తీవ్రమైన అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 24 లక్షల మంది విద్యార్థుల జీవితాలతో ముడిపడి ఉన్న అంశం కనుక నీట్ పరీక్ష నిర్వహణ ఎన్‌టిఎ (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) వ్యవహరించిన తీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనికి కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయచంద్ర, ప్రదీప్, బాబాఫక్రుద్దీన్, సుభాష్, హేమంత్, శశి కుమార్, నాగరాజు, రోహిత్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బాబావలి

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించండి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యకాసం నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఉపాధి కూలీల సమస్యలను తక్షణం పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు పెద్దన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సంచాలకులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ రాజకీయ ఒత్తిడితో నిలిపేసిన ఉపాధి హామీ పనులను వెంటనే పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 8 వారాల బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు.ఉపాధి కూలీలకు పనిముట్లు వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. గోరంట్ల మండలంలోని నార్సింపల్లి, వానవోలు, పాలసముద్రం, పుట్ట గుండ్లపల్లితో పాటు సోమందేపల్లి మండలంలోని కేతగానపల్లి, పుట్టపర్తి మండలంలో కప్పల బండ, పెడపల్లి గ్రామాల్లో నాలుగు నుండి 8 వారాల వరకు బిల్లులు బకాయి ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం రోజుకు 300 రూపాయలు కూలి తగ్గకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వ్యవసాయ మహిళా కార్మిక సంఘం మండల నాయకులు స్వర్ణలత, సిఐటియు ఆఫీస్ కార్యదర్శి సిద్దు, ఉపాధి మేట్ల సంఘం మండల నాయకులు బ్యాల్ల అంజి, సిఐటియు మండల నాయకులు ముత్యాలప్ప పాల్గొన్నారు.

లేపాక్షి :ఉపాధి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఫిరంగి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలం పరిధిలోని కంచిసముద్రం, మామిడిమాకులపల్లిలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు. పనిచేసే చోటే మస్టర్ రాయాలన్నారు. కూలీలకు పనిముట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు ప్రేమవతి, లక్ష్మి నారాయణ, కృష్ణమూర్తి, ఆనందప్ప, అదెప్ప తదితరులు పాల్గొన్నారు.

ఎంసెట్ లో మెరిసిన 'సువర్ణ భారతి' విద్యార్థి

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్ ఫలితాల్లో హిందూపురం సువర్ణ భారతి కళాశాల కి చెందిన సువర్ణం గగన్ శ్యామ్ రెడ్డి 875 ర్యాంక్ సాధించినట్లు కళాశాల వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠరెడ్డి, ఎఒ అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు గతంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన జెఇఇ పరీక్షల్లో గగన్ శ్యామ్ రెడ్డి 99.58 శాతం మార్కులు సాధించాడన్నారు. ప్రస్తుతం ఎంసెట్‌లో సైతం మంచి ర్యాంకు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులు గగన్ శ్యామ్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ప్రతిభ కనబర్చి కళాశాలకు మంచి పేరును తీసుకు రావాలని కోరారు.



గగన్‌శ్యామ్‌రెడ్డి

పండుగ వాతావరణంలో విద్యార్థులను ఆహ్వానించాలి

జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమం, సాధికారిత అధికారిణి కుష్బూకొఠారి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి కుష్బూకొఠారి

ప్రజాశక్తి-అనంతపురం

వేసవి సెలవులు ముగిసి హాస్టళ్లు పున్ణప్రారంభం అవుతున్న నేపథ్యంలో వసతి గృహాలకు వచ్చే విద్యార్థులను పండుగ వాతావరణంలో ఆహ్వానించాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారిత అధికారిణి కుష్బూకొఠారి సూచించారు. మంగళవారం నగరంలోని ప్రభుత్వ బిసి కళాశాల బాలికల వసతి గృహంలో జిల్లాలోని వసతి గృహ సంక్షేమాధికారులు, నాలుగవ తరగతి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 13న వేసవి సెలవుల అనంతరం హాస్టళ్లు పున్ణప్రారంభం అవుతున్నాయన్నారు. వారు వచ్చేలోపు హాస్టళ్ల పరిసరాలు, విద్యార్థుల గదులు, నీటి ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సిబ్బంది క్రమం తప్పకుండా విధులకు హాజరు కావాలన్నారు. స్థానికంగా నివాసం ఉండాలని, హాస్టల్ రికార్డులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వర్షాకాలం కావున హాస్టళ్లలో మొక్కలను పెంచి పచ్చదనం కల్పించి, పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్నారు. నాల్గవ తరగతి సిబ్బంది పట్ల అనుకూలంగా ప్రవర్తించాలన్నారు. హాస్టల్ విద్యార్థులను కన్న బిడ్డల్లా చూసుకోవాలన్నారు. వారికి ఏవిధమైన ఇబ్బదులు కలగకుండా చూసుకుని క్రమశిక్షణతో ఎదిగేలా చూడాలని సూచించారు. హాస్టళ్లలో 8వ తరగతి, 9వ తరగతి విద్యార్థులతో లిట్టిల్ డాక్టర్, లిటిల్ టైలర్, క్లీన్ అండ్ గ్రీన్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల దుస్తులకు బటన్లు, కుట్లు ఊడిపోయిన వారికి వాటిని సరి చేసేలా చూడాలన్నారు. తల్లిదండ్రుల సమావేశాలు, హెల్త్ చెకప్‌లు సక్రమంగా నిర్వహించాలన్నారు. హాస్టళ్లలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. నాల్గవ తరగతి సిబ్బంది సమయపాలన పాటించాలని, రాత్రిపూట వాచ్‌మెన్ డ్యూటీలు క్రమపద్ధతిలో చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఎప్పటికప్పుడు రుచిగా, వేడిగా అంధించాలని, పిల్లలకు దగ్గరగా ఉండి వారిపట్ల ప్రేమగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లాలోని సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం ప్రమాణస్వీకారం ప్రత్యక్ష ప్రసారం

రాయదుర్గం : సిఎం చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని బుధవారం రాయదుర్గంలో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ పి.కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద ఉన్న సీతారామాంజనేయ సత్రంలో ఉదయం 10:30 గంటలకు ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

రాయదుర్గం రూరల్ : ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని వీక్షించడానికి రాయదుర్గం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంగలకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ అల్లాబకష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సర్పంచులు, ఎంపిటిసి, జెడ్పీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, వార్డు సభ్యులు, మహిళా సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు

బెలుగుప్ప : నూతన ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారంపై మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సుబ్బరాజు మాట్లాడుతూ చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హరినాథ్‌రావు, డిప్యూటీ తహశీల్దార్ హుస్సేన్‌పీరా రావు, విస్తరణ అధికారి మాధవరెడ్డి, పరిపాలన అధికారి దామోదరయ్య, అసిస్టెంట్ ఇంజనీరింగ్ శివారెడ్డి, సూర్యప్రకాష్, గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంతుల్లో ప్రభుత్వ కార్యాలయాలు

నార్పల : మండల కేంద్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మంగళవారం రాత్రి విద్యుత్ కాంతులతో కళకళలాడాయి. బుధవారం ఉదయం 9.15 గంటలకు ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనుండటంతో మంగళవారం మధ్యాహ్నం నుంచే నార్పలలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను ముస్తాబు చేశారు. పండుగ వాతావరణలంలో ప్రమాణ స్వీకారం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు తెలుస్తోంది. దీనికితోడు గ్రామాల్లోని అన్ని సచివాలయాల ఆవరణల్లో చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

విజయవాడకు తరలిన టిడిపి శ్రేణులు

శింగనమల : ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి మండలం నుంచి టిడిపి నాయకులు మంగళవారం తరలివెళ్లారు. వెళ్లిన వారిలో టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షులు బండి వెంకటనారాయణ, సత్యనారాయణ, అట్టే శ్రీనివాసులు, ముంతా వెంకటేష్, వీరాంజనేయులు, మసూద్‌వలి, గోపాల్, తదితరులు ఉన్నారు.



విజయవాడ వెళ్తున్న టిడిపి నాయకులు



జగన్‌తో అనంత వెంకటరామిరెడ్డి

జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అనంత

అనంతపురం : వైసిపి అధినేత జగన్‌ను అనంతపురం మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల ఫలితాల అనంతరం అమరావతిలోని తాడేపల్లి నివాసంలో జగన్‌కు కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఇతర నియోజకవర్గాల నేతలు పాల్గొన్నారు.

సేవలను పోలీసుశాఖ మరువదు : ఎస్పీ



పదవీ విరమణ పొందిన వారితో ఎస్పీ గౌతమిశాలి

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

సుదీర్ఘంగా ప్రజలకు మీరు అందించిన సేవలు పోలీసుశాఖ ఎన్నటికీ మరువదని ఎస్పీ గౌతమిశాలి అన్నారు. జిల్లాలో ఇటీవల 9 మంది పదవీ విరమణ చేశారు. వీరిలో పదవీ విరమణ పొందిన ఎస్ఐ వెంకటాచలపతి, ఏఎస్ఐలు నాగరాజు, సయ్యద్‌ఇబ్రహీం, జనార్ధన్, ఏఆర్‌ఎస్ఐ ఖాదర్‌బాషా, శంకర్‌నాయక్, హెడ్ కానిస్టేబుల్ గౌస్‌పీరా దంపతులను సోమవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా పదవీ విరమణ చేసిన సిబ్బంది క్షేమ సమాచారాలు అడగటంతో పాటు పిల్లలు ఎంతమంది, వారి ఏం చేస్తున్నారు, తదితర వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ అనేది అందరికీ తప్పదన్నారు. అయితే ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాలుగు దశాబ్దాలు పని చేయడం విశేషమనిఅభినందించారు. శేష జీవితం సుఖసంతోషాలతో గడపాలని సూచించారు. ఫెన్షన్ ద్వారా వచ్చే సొమ్ముతో మీ అవసరాలకు ఖర్చు పెట్టుకోవాలన్నారు. మీకు ఇంకా ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలు గానీ, పెన్షన్ విషయంలో గానీ ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. వెంటనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తానన్నారు. ఈకార్యక్రమంలో అదనపు ఎస్పీ ఆర్.విజయభాస్కర్‌రెడ్డి, ఏ.ఆర్ డీఎస్పీ మునిరాజ, ఆర్ఐలు రెడ్డెప్పరెడ్డి, మధు, ఆర్‌ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, జాఫర్, గాండ్ల హరినాథ్, శ్రీనివాసులనాయుడు, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున వైద్యులు

రాకెట్ల పిహెచ్‌సిలో ఆశాడే

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండ మండలం రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ పావని, మానసిక వైద్య నిపుణులు విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఆశాడే నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ పావని ఆశా కార్యకర్తలకు వివిధ ఆరోగ్య సంబంధిత అంశాలపై అవగాహన కలిగించారు. ముఖ్యంగా పసి పిల్లల్లో అత్యధిక మరణాలకు కారణమైన అతిసార నివారణకు ఉపయోగించే ఒఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రల గురించి వివరించారు. అలాగే ఆశా కార్యకర్తలు వాడే మొబైల్ యాప్‌పై తెలియజేశారు. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన వినియాగం, కిల్కారి ఫోన్ సందేశాలు గర్భిణులు, బాలింతలకు చేరువయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ నాగారంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ, సూపర్‌వైజర్లు స్వర్ణలత, శేఖర్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల గోడౌన్ తనిఖీ



ఎరువుల గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ

శింగనమల : మండలంలోని లోలూరు క్రాస్ వద్ద ఉన్న భాస్కర్ ఫర్టిలైజర్ ఎరువుల తయారీ కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారిణి ఉమామహేశ్వరమ్మ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా లైసెన్స, రా మెటీరియల్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్ట్రర్లు, సేల్స్ రెగసిటర్, ల్యాబ్ రిజిస్టర్లు, ల్యాబ్, తయారీ మెషినరీ, గోడౌన్‌ను క్షణ్ణంగా పరిశీలించారు. ఎరువుల తయారీకి సంబంధించి ప్రతినెలా స్టాక్ రిపోర్ట్ తప్పకుండా ఉన్నతాధికారులకు పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవ సాయ సంచాలకులు (రెగులర్) వెంకటరాముడు, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ సిబ్బంది టెక్నికల్ బాలానాయక్, మండల వ్యవసాయ అధికారి అన్వేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎపి ఈఎపి సెట్ ఫలితాల్లో 'నారాయణ' ప్రభంజనం

ప్రజాశక్తి-అనంతపురం

ఎపి ఈఏపీ సెట్-2024 ర్యాంకుల ఫలితాల్లో అనంతపురం నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరడానికి నిర్వహించిన ఈ ప్రవేశ పరీక్షలో జి.శశికిరణ్ 120 మార్కులతో 281 ర్యాంకు సాధించారు. అలాగే కళాశాలకు చెందిన సి.మేఘన 724, కె.అవినాష్ 1194, యశస్విని 1682, వినీల 1736, అజయ్ కృష్ణారెడ్డి 1849 ర్యాంకు సాధించి ప్రతిభను చాటారు. అలాగే వెయ్యిలోపు 2, 2వేలలోపు 5, 5వేలలోపు 15, 10వేలలోపు 44, 20వేలలోపు 100, 30వేలలోపు 190, 50 వేలలోపు 379 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, బోధన చేసిన సిబ్బందికి అనంతపురం నారాయణ కళాశాల కోర్ డీన్ బికె.బద్రీనాథ్, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, డిజిఎం వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాళ్లు రవిశంకర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, ఓబనగౌడ, హిమబిందు, శిఖామణి, లక్ష్మన్న, జయలక్ష్మి, బాలన్న అభినందనలు తెలిపారు.







ఎపి ఈసెట్ ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో నారాయణ కళాశాల సిబ్బంది



ఆర్థికసాయం అందజేస్తున్న బార్ అసోసియేషన్ నాయకులు

సంపత్ కుటుంబానికి ఆర్థికసాయం

హిందూపురం : గతనెలలో హత్యకు గురైన విద్యార్థి సంఘం నాయకుడు, న్యాయవాది సంపత్‌కుమార్ కుటుంబానికి స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. న్యాయవాదులు స్వచ్ఛందంగా తమవంతు సహకారం అందించగా మంగళవారం బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజశేఖర్ ఆధ్వర్యంలో సంపత్‌కుమార్ తండ్రి రాజుకు రూ.40 వేలు అందించారు. ఆర్థిక సహాయం అందించడం పట్ల సంపత్ తండ్రి న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీరాములు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, జ్ఞానేష్ తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

ప్లాస్టిక్ కవర్లు సీజ్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలో విచ్చలవిడిగా సాగుతున్న ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించే క్రమంలో కమిషనర్ మెగా స్వరూప్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది బుధవారం నగరంలోని రాజు రోడ్డులోని వివిధ షాపుల్లో దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. నగరంలోని రాజు రోడ్డులోని స్వగృహ ఫుడ్స్‌లో నిషేధిత ప్లాస్టిక్ వినియోగిస్తునందుకు రూ5000 ఫైన్ విధించారు. అలాగే మహావీర్ ప్లాస్టిక్స్ మరియు మహాలక్ష్మి ప్లాస్టిక్ షాపులో ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. హాలక్ష్మి ప్లాస్టిక్ రూ.3000, మహావీర ప్లాస్టిక్ రూ.2000 చొప్పున జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మేఘ స్వరూప్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తే మొదటిసారి అపరాధ రుస్తుం విధిస్తామని, రెండవసారి అమ్మితే ట్రేడ్ లైసెన్స్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడా ఏ వ్యాపారం చేసుకునేందుకు వీలులేకుండా ట్రేడ్ లైసెన్సు ఇక జారీ చేయబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ విష్ణుమూర్తి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ ఆంజనేయులు, సెక్రటరీ తిప్పేస్వామి, మేస్త్రి వర్ధన్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దోమల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-వజ్రకరూరు

దోమల నివారణకు చర్యలు చేపట్టాలని ఉరవకొండ డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి భక్తుల కోదండరామిరెడ్డి సూచించారు. మంగళవారం ఉరవకొండ పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో మలేరియా వర్కర్లతో మలాథిన్ డబ్ల్యు డిపి స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవులను పూర్తి చేసుకుని హాస్టల్‌కు విద్యార్థులు వచ్చేలోపే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దోమకాటు వల్ల వచ్చే ప్రాణాంతకమైన వ్యాధుల నుంచి విద్యార్థులను రక్షించడానికి అన్ని జాగ్రత్తలు కూడా తీసుకుంటున్నట్లు వివరించారు. పట్టణంలోని ప్రభుత్వ హాస్టల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతోపాటు విద్యార్థుల గదులు, క్లాస్‌రూమ్‌లు, వంట గదులు, డార్నెట్ రూముల్లో తగు జాగ్రత్తలు తీసుకుంటూ క్రిమి సంహారక రసాయనాలతో స్ప్రేయింగ్ చేయిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సునీత, వైస్ ప్రిన్సిపాల్ ఎం.జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.



బ్యానర్లను ప్రదర్శిస్తున్న వైద్యసిబ్బంది

విస్తృతంగా మొక్కల పెంపకం

ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలి - కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వర్షాకాలం నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా విస్తతంగా చెట్లు, మొక్కల పెంపకం చేపట్టాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో మొక్కల పెంపకంపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెట్లు, మొక్కల పెంపకం కోసం డీఎఫ్‌వో, సోషల్ ఫారెస్ట్రీ, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఐసిడిఎస్, డిఈఓ, ఉపాధి హామీ, తదితర శాఖల పరిధిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. జిల్లాలో పచ్చదనం సంతరించుకునేలా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. 30 రకాల చెట్లను నాటేలా దష్టి పెట్టాలని, ఒకే వీధిలో ఒకే విధమైన చెట్లు ఉండాలన్నారు. అన్ని మున్సిపాలిటీలలో వ్యక్తిగతమైన శ్రద్ధ పెట్టి పార్కులు, ఇతర చోట్ల మొక్కల పెంపకం చేపట్టేలా చూడాలన్నారు. మొక్కల పెంపకంలో స్వచ్ఛంద సంస్థలను గుర్తించి భాగస్వామ్యం చేయాలన్నారు. భవిష్యత్తును గుర్తుపెట్టుకుని మొక్కల పెంపకం విస్తతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఏ వీధికి ఏ రకమైన చెట్లు నాటాలి అనేది గుర్తించాలని, ప్రతి మూడు మీటర్లకు ఒక చెట్టు ఉండేలా చూడాలని, ఎక్కడైనా చెట్లు తుంచేస్తే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం నగరంలో అశోక్ నగర్, రాంనగర్ 80 ఫీట్ రోడ్, జెఎన్టీయు రోడ్, ఆర్టీవో ఆఫీస్ రోడ్, గౌరవ గార్డెన్, తదితర ప్రాంతాలను గుర్తించి మొక్కలను నాటాలన్నారు. మొక్కల సంరక్షణ కోసం వార్డు స్థాయి అధికారులను నియమించాలన్నారు. బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, విద్యా శాఖల పరిధిలోని విద్యాసంస్థల్లో విరివిగా మొక్కలు పెంపకం చేపట్టాలన్నారు. ఎవరైతే మొక్కలు బాగా నాటుతారో వారికి అవార్డు అందిస్తామన్నారు. చరిత్ర సష్టించేలా మొక్కల పెంపకం చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఎఫ్ఓ వినీత్ కుమార్, మున్సిపల్ ఆర్డీ పివివిఎస్.మూర్తి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదన్, డీఈవో వరలక్ష్మితో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

తలుపుల : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ అఫ్తాఫ్ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రస్తుతం వస్తున్న వర్షాల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ ఆశ్రిత,కదిరి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ రామాంజనేయులు, సూపర్‌వైజర్ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

మడకశిర : మండలం పరిధిలోని గౌడనహళ్లి గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.రాజు పరిష్కరించారు. ఎన్నికల ప్రచారంలో గ్రామానికి వెళ్లిన ఆయనకు మహిళలు గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను వివరించారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే సమస్యను పరిష్కరిస్తానని ఆసందర్భంలో ఎంఎస్. రాజు గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ఎంఎస్. రాజు తన సొంత నిధులతో గౌడనహళ్లి గ్రామంలో బోరుబావిని తవ్వించారు. అందులో 2 ఇంచుల నీరు లభించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజుకు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తరలిన తెలుగు తమ్ముళ్లు




చంద్రబాబు ప్రమాణస్వీకారోత్సవానికి వెళుతున్న తనకల్లు, కదిరి ప్రాంతానికి చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి - తనకల్లు

ఎపి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేస్తున్న కార్యక్రమానికి హాజరవడానికి తనకల్లు మండలం నుంచి అధిక సంఖ్యలో తెలుగుతమ్ముళు బయలు దేరారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. టిడిపి మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ప్రసాద్, మండల తెలుగు యువత అధ్యక్షులు కావడి ప్రవీణ్ కుమార్, వార్డ్ మెంబర్ దామోదర్, ఎస్సీ సెల్ కుళ్లాయప్ప ఆధ్వర్యంలో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తదితరులు తరలివెళ్లారు.

మడకశిర : ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు నాలుగవసారి ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా నియోజకవర్గం నుండి భారీగా తెలుగు తమ్ముళ్లు బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుండి తెలుగు తమ్ముళ్లు భారీగా విజయవాడకు తరలి వెళ్లారు. మండలంలోని గుర్రపు కొండ గ్రామానికి చెందిన డి. పాండురంగప్ప, రవికుమార్, నాగేంద్ర, రవికుమార్, మాలయ గౌడ, జయన్న, తిప్పేస్వామి తదితరులు తరలి వెళ్లారు.

కదిరి టౌన్ : ముఖ్యమంత్రిగా తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఆకార్యక్రమంలో పాల్గొనడానికి కదిరికి చెందిన కూటమి నాయకులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయడంతో దాదాపు వెయ్యి మంది కూటమి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

పుట్టపర్తి అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రిగా టిడిపి అధినేత చంద్రబాబు చేయనున్న ప్రమాణ స్వీకారోత్సవానికి తెలుగు తమ్ముళ్లు భారీగా తరలి వెళ్లారు. మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా బస్సులలో, కార్లలో, రైలులో టిడిపి నాయకులు కార్యకర్తలు తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 20 బస్సులలో విజయవాడకు తరలి వెళ్లారు. ఆయా మండలాల కన్వీనర్లు ముఖ్య నాయకుల ఆధ్వర్యంలో విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఈ ప్రమాణ స్వీకారానికి ఇదివరకే పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, ఆయన తనయుడు పల్లె వెంకటకృష్ణ కిషోర్ రెడ్డి విజయవాడకు చేరుకున్నారు.



పవన్ కళ్యాణ్‌తో చిలకం మధుసూదన్‌రెడ్డి

పవన్‌కళ్యాణ్‌ను కలిసిన 'చిలకం'

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్‌ను ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుబాకాంక్షలు తెలిపారు. సార్వత్రిక ఎన్నికలలో ఎన్నడూ లేనివిధంగా 21సీట్లకు 21 సీట్లు ఘన విజయం సాధించినందుకు విజయవాడలోని మంగళగిరిలో జనసేన పార్టీ కార్యాలయంలో చిలకం మధుసూదన్‌రెడ్డి పవన్‌కళ్యాణ్‌కు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.

అందరు ఒక్కటయ్యారు.. మమ అనిపించారు..!

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపల్ పరిధిలోని కొట్నూరు చెరువులో ఉన్న చేపలను పట్టుకోవటానికి మంగళవారం నిర్వహించిన వేలంపాటపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అందరూ ఏకమై మమ అనిపించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మున్సిపల్ పరిధిలోని కొట్నూరు చెరువులో ఉన్న మత్స్య సంపదను అనుమతులు లేకుండా కొంత మంది తమిళనాడుకు చెందిన వారితో పట్టించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై ప్రజాశక్తి ప్రత్యేక కథనాల రూపంలో సమస్యను వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై మత్స్య శాఖ స్పందించి మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 20 రోజుల కాల వ్యవధితో చేపల చెరువును మత్స్య శాఖ శంకరయ్య ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో ఉన్నా మత్స్య సంపదను 20 రోజులు పట్టడానికి సర్కారు వారి పాటను నిర్వహించారు. ఈ పాటలో ఐదుగురు పాల్గొనగా ఇందులో శివ శంకర్ రెడ్డి రూ. 15వేలతో పాటను ప్రారంభించారు. నిబంధనల మేరకు సర్కారు వారి పాటపై నుంచి వేలంలో పాడాల్సి ఉండగా దాని కన్న రూ.20, 819 తక్కువ ధర నుంచి పాటను ప్రారంభించడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. చివరకు సోమశేఖర్ రూ.36,100లకు దక్కించుకున్నారు. ఈ వేలం పాటను పూర్తిగ పరిశీలన చేస్తే మత్స్య శాఖ అధికారులు, బహిరంగంలో పాల్గొన్న వారు అందరు కలిసి వేలం పాటను మమ అనిపించి, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనుమతులిస్తే వ్యర్థాలు తరలిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

బక్రీదు పండుగను పురస్కరించుకుని పురపాలక సంఘ వ్యాప్తంగా వ్యర్థ పదార్థాలను సేకరించి ప్రత్యేక వాహనంలో పురపాలక సంఘ డంప్ యార్డుకు తరలిస్తామని రహమత్ ఏ ఆలం సామాజిక సంఘం అధ్యక్షులు అబ్దుల్ మాలీక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కార్యలయంలో మున్సిపల్ వైస్ చైర్మేన్ జబివుల్లాతో కలిసి కమిషనర్ శ్రీకాంత్ రెడ్డికి వినతిని ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బక్రీదు పండుగను పురస్కరించుకుని మూడు రోజుల పాటు ఖుర్బానీ(బలి)ఇచ్చే కార్యక్రమంలో వ్యర్థ పదార్థాలను ప్రత్యేక వాహనంలో సేకరించి, దానిని పురపాలక సంఘం వారు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుకు తరలిస్తామన్నారు. దీంతో పట్టణం శు భ్రంగా ఉంటుందన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సామాజిక సేవా సంఘం తరపున టాటా ఏసీ వాహనాల్లో వ్యర్థ పదార్థాలను సేకరిస్తామన్నారు. డంప్ యార్డులో మున్సిపల్ శాఖ తరపున ఒక గుంతను ఏర్పాటు చేయడంతో పాటు సేకరించిన వ్యర్థాలను గుంతలో వేయడానికి ట్రాక్టర్ అందించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతు మంచి పనులు చేయాడానికి ముందుకు వస్తే తప్పకుండా అనుమతులు ఇవ్వడంతో శాఖ తరపున అవసరమైన సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

బాల్య వివాహాలను అరికట్టడాన్ని ప్రతిఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి సూచించారు. పట్టణంలోని ఆర్డీవో సమావేశ భవనంలో ధర్మవరం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల్య వివాహాల నియమ నిబంధనలు, బాలలపై లైంగిక దాడుల నిరోధక చట్టంపైన ఒక్కరోజు అవగాహన సదస్సును మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి, సీడీపీవో లక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాలు నిలుపుదల చేయడానికి జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులను నియమించారన్నారు. ఒక అమ్మాయి చదువు ఇంటికి వెలుగునిస్తుందన్నారు. బాలికల హక్కులను కాపాడాలని బాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని తెలిపారు. బాలలపై లైంగిక దాడులు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. బాల్య వివాహాలు నిరోధక చట్టంలోని అంశాలను ఈసందర్భంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో మహేష్, పరిరక్షణ అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, శాంతి, కౌసల్య, ఐసీడీఎస్ సూపర్వైజర్లు, సచివాలయాల అడ్మిన్లు, వార్డు వీఆర్వోలు, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో వెంకట శివరామిరెడ్డి

రాయదుర్గం - తుంకూరు రైల్వే లైన్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

ప్రజాశక్తి -మడకశిర

రాయదుర్గం - తుంకూరు రైల్వేలైన్‌ను సత్వరమే పూర్తి చేయాలని అనంతపురం జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ ఉపాధ్యక్షులు ఆనంద రంగారెడ్డి కోరారు. కర్నాటక రాష్ట్రం తుంకూరు లోక సభ సభ్యులు సోమన్న కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన నేపథ్యంలో ఆనందరంగారెడ్డి ఆయనకు వాట్సప్‌ద్వారా అభినందనలు తెలిపారు. ఇదే సందర్భంగా రాయదుర్గం - తుంకూరు రైల్వేలైన్‌ను సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

సిఎం ప్రమాణస్వీకారోత్సవం వీక్షణానికి ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్డీవో, కమినర్, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ముఖ్యమంత్రిగా నారాచంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమాన్ని వీక్షించడానికి స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ప్రత్యేక స్క్రీన్లను ఏర్పాటుచేశారు. వీటిని స్థానిక ఆర్డీవో వెంకటశివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రాంకుమార్, జూనియర్ ఎన్టీఆర్ ఫాన్స్ రాష్ట్ర కన్వీనర్ ఎల్. నరేంద్రచౌదరి, టీడీపీ నాయకులు మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గోనుగుంట్ల విజయ్‌కుమార్, నాయకులు చింతలపల్లిమహేశ్ చౌదరి, పణికుమార్, నాగూరుస్సేన్, పురుషోత్తంగౌడ్, తలారి చంద్రమోహన్‌బాబు, రాంపురంశీన, గంగారపు రవి, మేకల రామాంజినేయులు, ఇర్షాద్, దుర్గేశ్ తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు బుధవారం ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా ఆ కార్యక్రమాన్ని కదిరి నియోజకవర్గ ప్రజలు,ఎన్డీఏ కూటమి సభ్యులు వీక్షించడానికి కదిరి శాసనసభ్యులు కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలో ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేశారు. కదిరి పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేసినట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్ తెలిపారు.

పుట్టపర్తి అర్బన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రులు బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ నుండి ఒక ప్రకటన విడుదల అయింది. విజయవాడలోని గన్నవరం వద్ద గల కేసరిపల్లిలో నిర్వహించనున్న ప్రమాణ స్వీకారకార్యక్రమాన్ని జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా ప్రజలంతా వీక్షించేందుకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఈ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం అన్ని మున్సిపాలిటీలలో ప్రధాన కేంద్రాల్లో ప్రారంభమవుతుంది. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉదయం 11 : 27 గంటలకు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఎల్ఇడి స్క్రీన్లను, టీవీ సెట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సత్యకుమార్ గెలుపు చారిత్రాత్మకం

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్



ఎమ్మెల్యేను అభినందిస్తున్న నాయకులు

ధర్మవరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి సత్యకుమార్ యాదవ్ అత్యధిక మెజార్టీతో గెలవడం చారిత్రాత్మకమని బిజెపి నాయకుడు డోల రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడలోని సత్య కుమార్ యాదవ్ స్వగృ హంలో డోల రాజారెడ్డి సత్యకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. 56 సంవత్సరాల తర్వాత ధర్మవరంలో ఒక బీసీ అభ్యర్థి ఎమ్మెల్యే కావడం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరానికి చెందిన బిజెపి నాయకులు జింక రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా, ప్యాకేజీ సాధించండి : శైలు

ప్రజాశక్తి-అనంతపురం

విభజన హామీల్లో భాగంగా రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ, వెనుకబడిన రాయలసీమ లాంటి ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీని సాధించేందుకు రాష్ట్రంలోని ఎంపీలు కృషి చేయాలని మాజీ పిసిసి అధ్యక్షుడు సాకే శైలజనాథ్ కోరారు. మంగళవారం అనంతపురంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు కూటమికి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారన్నారు. అత్యధిక ఎంపీ స్థానాలను కూడా టిడిపి, జనసేన, బిజెపి కైవసం చేసుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఎన్నికైన ఎంపీలపైన ఆధారపడే కేంద్రంలోని ప్రభుత్వం నడిచే పరిస్థితి ఉందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి రావాల్సిన ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీని తెచ్చుకునేందుకు ఆంధ్రప్రదేశ్ ఎంపీలు కృషి చేయాలన్నారు. ఇక రాష్ట్రాభివృద్ధి కోసం కొత్త ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళితో ముందుకు సాగాలన్నారు. చంద్రబాబు నాయుడు అనుభవంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్రంలో ప్రత్యర్థులపై దాడులు, వైఎస్ఆర్ విగ్రహాల ధ్వంసం లాంటి కార్యక్రమాలు జరుగుతుండడం విచారకరం అన్నారు. ఇలాంటి వాటిని నివారించేలా చంద్రబాబు నాయుడు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని తెలియజేశారు.